క్లుప్తంగా

ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు సీజ్



ఇసుక ట్రాక్టర్లతో సీఐ, ఎస్సై

ఆదిలాబాద్‌రూరల్: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను మావల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిధర్ మంగళవారం సీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ఎవరైనా అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవన్నారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని మైనింగ్ అధికారులకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్సై విష్ణువర్ధన్, సిబ్బంది ఉన్నారు.

'ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు'



మాట్లాడుతున్న గోవర్ధన్

బోథ్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు సీపీఐ మద్దతు ఇవ్వనున్నట్లు నాయకులు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. నాయకుడు గోవర్ధన్ మాట్లాడుతూ రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో సీపీఐ పార్టీ నుంచి అభ్యర్థులను నిలబెట్టాలని రాష్ట్ర కార్యవర్గాన్ని కోరినట్లు తెలిపారు. కాగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా భారతాల గోవర్ధన్‌ను ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు. నాయకులు విలాస్ పాల్గొన్నారు.

'బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి'



తాంసిలో ప్రచారం చేస్తున్న సంతోష్ రెడ్డి

తాంసి: పట్టభద్రుల బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్ రెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. తమ అభ్యర్థి అంజిరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరుతూ కరపత్రాలు అందజేశారు. నాయకులు సుధాకర్, విలాస్, అనిల్ రెడ్డి, సాయి కుమార్ ఉన్నారు.

'గ్రాడ్యుయేట్స్ బోర్డు ఏర్పాటు చేస్తా'

ఎదులాపురం: తనను పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపిస్తే గ్రాడ్యుయేట్స్ బోర్డు ఏర్పాటు కృషి చేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి పులగం దేవిదాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్‌లో మంగళవారం విలేకరుల మాట్లాడారు. గ్రాడ్యుయేట్స్ బోర్డు ఏర్పాటుతో పాటు ఉచిత విద్య, వైద్యం, గ్రాడ్యుయేషన్ తర్వాత మూడేళ్లు రూ.10వేల నిరుద్యోగ భృతి, కార్పొరేట్ విద్యా సంస్థల్లో బీపీఎల్ విద్యార్థులకు ఉచిత విద్య అమలుకు కృషి చేస్తానన్నారు.

ఏఎన్‌ఎంపై మహిళ దాడి

బోథ్: మండలంలోని మర్లపెల్లి గ్రామంలోని పల్లె దవాఖానాలో ఏఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న డెగం సునందపై గ్రామానికి చెందిన అడిగెం హంసబాయి దాడి చేసిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై ఎల్. ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం పల్లె దవాఖానాలో విధులు నిర్వహిస్తున్న సునందపై ఉదయం గ్రామానికి చెందిన హంసబాయి అనే మహిళ మద్యం సేవించి అకారణంగా దాడి చేసింది. అసభ్యపదజాలంలో దూషించింది. సిబ్బంది సౌజన్యపై బెదిరింపులకు పాల్పడింది. కాగా ఏఎన్‌ఎం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'సోయం'ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



సోయం బాపూరావును శాలువాతో సన్మానిస్తున్న నాయకులు

ఇచ్చోడ: ఆదిలాబాద్ మాజీ ఎంపీ సోయం బాపూరావును మంగళవారం ఇచ్చోడ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. సోయం మాట్లాడుతూ... రానున్న స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను కలిసికట్టుగా గెలుపించుకోవాలన్నారు.

యథేచ్ఛగా మొరం తవ్వకాలు

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అక్రమార్కులు
- అనుమతులు లేకుండానే టిప్పర్లలో తరలింపు
- అధికలోడుతో రోడ్లు ధ్వంసం



కజ్జర్ల శివారులో టిప్పర్లలో మొరం నింపుతున్న అక్రమార్కులు

తలమడుగు: జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో మొరం తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. జేసీబీల సాయంతో పదుల సంఖ్యలో టిప్పర్లల్లో అక్రమంగా మొరం తరలిస్తున్నారు. కజ్జర్ల, దేవాపూర్, పొన్నారి గ్రామాల శివారుల్లోని ప్రభుత్వ, అసైన్మెంట్, అటవీ భూముల్లో యథేచ్ఛగా మొరం తవ్వకాలు సాగిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. మొరం తవ్వకాలు చేపట్టాలంటే రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారుల అనుమతులు తీసుకోవాలి. కానీ ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు సాగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమంగా మొరం తరలింపులో సంబంధిత శాఖ అధికారుల ప్రమేయం ఉందని పలువురు విమర్శిస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్లు మొరం తరలించడంతో సమీపంలో ఉన్న పంట పొలాల్లో దుమ్ము, ధూళి చేరి పంటలు నాశనమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికలోడు టిప్పర్లు వెళ్తుండడంతో రోడ్లు సైతం అధ్వానంగా మారుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

కలిసి వచ్చిన క్వారీలు..

మావల, తాంసి, తలమడుగు మండలాల శివారులు కలిసి ఉన్నాయి. ఈ శివారులో మొరం తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. మూడు శివారులు కలిసే ప్రదేశంలో అక్రమార్కులు పెద్ద ఎత్తున తవ్వకాలు చేపట్టారు. 100 అడుగుల లోతులో మొరం తవ్వకాలు జరిపారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం



మొరం తవ్వకాలతో ఏర్పడిన క్వారీ

చేసుకోవచ్చు. నిత్యం నాలుగు నుంచి ఐదు వరకు జేసీబీలతో మొరం తవ్వకాలు సాగిస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్లు మొరం తరలిస్తున్నాయి. ఒక టిప్పర్ ధర రూ. 2000 నుంచి రూ.3000 వరకు విక్రయిస్తున్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు అక్రమంగా మొరం తవ్వకాలు చేపట్టే ప్రదేశంలో నాలుగు టిప్పర్లను పట్టుకున్నారు. గతంలో జేసీబీలను టిప్పర్లను అధికారులు పట్టుకొని సీజ్ చేయగా రూ. 2 లక్షల జరిమానా విధించారు. అయినా మొరం తవ్వకాలు మాత్రం ఆగడం లేదు. అధికారులు తనిఖీలు చేపడితే, రాత్రి వేళలో తవ్వకాలు సాగిస్తున్నారు. అధికారులు తనిఖీలు చేసిన సమయంలో మొరం తవ్వకాలు నిలిపివేయడం తర్వాత మళ్లీ తవ్వకాలు జరపడం చేస్తున్నారు. కజ్జర్ల, దేవాపూర్, మావల శివారులో తవ్వకాలు నిత్యం జరుగుతున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా టిప్పర్లతో మొరం జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారు. సంబంధిత రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు అక్రమ మొరం తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎవరికీ అనుమతులు లేవు

మొరం తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. అక్రమంగా మొరం తవ్వకాలు జరిపే వారిపై చర్యలు తీసుకుంటాం. ఇటీవల నాలుగు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నాం. గతంలో దాడులు చేసి జేసీబీలను పట్టుకుని జరిమానా విధించాం.

– రాజమోహన్, తహసీల్దార్

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న ఏక్‌నాథ్ మహరాజ్ శిష్యులు

నేరడిగొండ: నాందేడ్ జిల్లా కందార్‌లో ఈనెల 27 నుంచి మార్చి 6వ తేదీ వరకు జరిగే అఖండ హరినామ సప్తా కార్యక్రమానికి హాజరు కావాలని ఏక్‌నాథ్ మహరాజ్ శిష్యులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కోరారు. మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుమల్ గౌడ్, దేవన్న, ఖలీల్, మహదేవ్ ఉన్నారు.

ఉపాధి పనులు పకడ్బందీగా చేపట్టాలి



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: మండలంలో ఈ ఏడాది చేపడుతున్న ఉపాధి పనులను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మండలంలోని కామగిరి గ్రామంలో ఉపాధి పనుల ను పరిశీలించి మాట్లాడారు. పనులు పకడ్బందీగా నిర్వహిస్తూ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఫీల్డ్‌అసిస్టెంట్లు విధిగా పనులు చేపడుతున్న ప్రదేశాల్లో పర్యవేక్షించాలన్నారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట ఫీల్డ్‌అసిస్టెంట్ సుధాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



చెక్కు అందజేస్తున్న తహసీల్దార్ రఘునాథ్‌రావు

బేల: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం 53 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను మండల తహసీల్దార్ కొట్నాక రఘునాథ్‌రావు పంపిణీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ సిడాం వామన్‌రావు, ఎంపీవో మహేశ్‌కుమార్, ఆర్ఐ సాజిద్, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్, జూనియర్ అసిస్టెంట్ అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

పంట దిగుబడుల్లో జాగ్రత్తలు పాటించాలి



రైతులతో మాట్లాడుతున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): పంట దిగుబడుల్లో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. మంగళవారం జైనథ్ మండలంలోని దీపాయిగూడ గ్రామంలో నాయకులతో కలిసి పంట పొలాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో దిగుబడుల్లో రైతులు ఎదుర్కొంటున్న నష్టాలపై అధ్యయనం చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాయకులు గోవర్ధన్ యాదవ్, లక్ష్మణ్, సతీశ్, మహేందర్, అశోక్, విలాస్, రామన్న, నల్ల రామన్న, విఠల్, అశోక్, ఇస్తారి, దేవర్తి అశోక్, దేవన్న ఉన్నారు.

సామాజిక తనిఖీ ప్రారంభం



రికార్డులను సేకరిస్తున్న తనిఖీ బృందం అధికారులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో సుమారు రూ.8 కోట్ల నిధులతో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రారంభించారు.మంగళవారం తనిఖీ ఎస్‌ఆర్‌పీ,డీఆర్‌పీలు టెక్నికల్,ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుండి జరిగిన పనుల నివేదిక,ఖర్చు చేసిన నిధుల రికార్డులను సేకరించారు.వారం రోజుల పాటు గ్రామాల్లో ఇప్పటి వరకు జరిగిన పనులను క్షేత్ర స్థాయిలో పరిశిలించడంతో పాటు ఉపాధి పనులు చేసిన కూలీల నివేదకను సేకరించనున్నట్లు ఏపీవో జాధవ్ శ్రీనివాస్ తెలిపారు.సామాజిక తనిఖీతో పాటు గ్రామ సభలు పూర్తి చేసిన అనంతరం ప్రజావేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు.సామాజిక తనిఖీ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యుత్ స్తంభం తొలగించకుండానే రోడ్డు పనులు



రోడ్డు మధ్యలో అడ్డుగా విద్యుత్ స్తంభం, తీగలు

తాంసి: రోడ్డు మధ్యలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించకుండా రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. మండలంలోని బండల్ నాగాపూర్ నుంచి కప్పర్ల గ్రామం వరకు బీటీ రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా కప్పర్ల గ్రామం వద్ద రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం అడ్డుగా ఉంది. మధ్యలో ఉన్న స్తంభాన్ని తొలగించి పనులు చేపట్టాల్సి ఉన్నా గుత్తేదారు స్తంభాన్ని అలాగే వదిలేసి పనులు చేపడుతున్నారు. రోడ్డు మధ్యలో ఉన్న స్తంభం వల్ల వాహనదారులు ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. అధికారులు స్తంభాన్ని తొలగించిన అనంతరం పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

'ఎస్సీ వర్గీకరణలో తప్పులను సరిదిద్దాలి'



నేరడిగొండ: ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సభ్యులు

బోథ్: ఎస్సీ వర్గీకరణ సవరణలో జరిగిన తప్పులను సరిదిద్దాలని బోథ్ మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎలుక రాజు ఆధ్వర్యంలో మంగళవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి విన్నవించారు. సుప్రీంకోర్టు సూచించిన ఆధారంగా 2014, జూన్, 2వ తేదీ నుంచి రాష్ట్రంలో లబ్ధిదారుల వివరాలను సేకరించాలన్నారు. అధ్యక్షుడు కొప్పుల రమేశ్, మల్లన్న, దేవన్న, ప్రహ్లాద్, రాజేశ్వర్, రాజు, సోమన్న, లక్ష్మణ్, ఊషన్న, భూమేశ్, రమేశ్, సురేందర్, సుధీర్, పాశం రాఘవేంద్ర, అశోక్, స్వామి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలి

నేరడిగొండ: ఎస్సీ వర్గీకరణ అంశాన్ని బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలని మాల సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశంపై సవరణలలో జరిగిన తప్పులను సరిదిద్ది సుప్రీంకోర్టు జడ్జిమెంట్‌లో సూచించినట్లుగా లబ్ధిదారుల డాటా తయారు చేయాలన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే బడ్జెట్ సమావేశాల్లో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జిల్లా మాల, మాల ఉపకులాల సంఘాల ఆధ్వర్యంలో నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు వినతిపత్రం అందించారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లుపై పునరాలోచించాలని, ఎస్సీ రిజర్వేషన్ 22 శాతానికి పెంచాలన్నారు. అనంతరం మాల సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేశ్, సుశీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరుస దొంగతనాలతో బెంబేలు

- వారం రోజుల్లో మూడు దొంగతనాలు
- తాజాగా వైన్స్‌లో చోరీ



దొంగతనం జరిగిన తీరును పరిశీలిస్తున్న సీఐ రహీంపాషా, సిబ్బంది

నార్నూర్: దొంగలు ప్రజలను హడలెత్తిస్తున్నారు. వరుస చోరీలతో కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారు. నార్నూర్ మండల కేంద్రంలో వారం వ్యవధిలోనే ప్రధాన మార్కెట్ ప్రాంతంలో మూడు దొంగతనాలు జరిగాయి. ఇప్పటికే ప్రముఖ వ్యాపారి జ్ఞానోబా పుష్కర్ కుటుంబ సమేతంగా వారం రోజుల క్రితం కుంభమేళాకు వెళ్లగా తాళం పగలగొట్టి రూ.2 లక్షల నగదు ఎత్తుకెళ్లిన సంఘటన మరువకముందే ఈనెల 16న ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై సిమెంట్ వర్క్ చేస్తున్న కూలీలు రాత్రిపూట నిద్రిస్తున్న సమయంలో వారికి సంబంధించిన మూడు సెల్ ఫోన్లు, రూ.5వేల నగదు దొంగిలించారు. ఈనెల 18న సోమవారం అర్ధరాత్రి 2గంటల ప్రాంతంలో మండల కేంద్రంలోని శ్రీనివాస వైన్స్ షట్టర్ తాళం పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. వైన్స్ దుకాణం నుంచి రూ.97,000 నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు పేర్కొన్నారు. వరుస దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేస్తుండడంతో ఊళ్లకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. దొంగలు సీసీ ఫుటేజీలో రికార్డు అవుతున్నప్పటికీ ముఖానికి పూర్తిగా మాస్కులు ధరించి ఉండటంతో గుర్తుపట్టలేని పరిస్థితి ఉంది. ఈ మూడు దొంగతనాల్లో కేవలం ఇద్దరు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది.

ఖాళీగా ఎస్సై పోస్ట్..

మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు ఏడాది నుంచి ఎస్సై పోస్ట్ ఖాళీగా ఉంది. వరుస దొంగతనాలు జరుగుతున్నా కనీసం పెట్రోలింగ్ నిర్వహించలేని పరిస్థితిలో పోలీస్ శాఖ ఉంది. ఇప్పటికైనా పోలీస్‌శాఖ స్పందించి రెగ్యులర్ ఎస్సైని నియమించాలని మండల వాసులు కోరుతున్నారు.

పెట్రోలింగ్ నిర్వహిస్తాం..

మండలంలో రాత్రివేళ పెట్రోలింగ్ నిర్వహిస్తాం. దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అనుమానిత వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయండి. కేవలం ఇద్దరు మాత్రమే దొంగతనానికి పాల్పడుతున్నట్లు సీసీ ఫుటేజీల్లో రికార్డయ్యింది. త్వరలో దొంగలను పట్టుకుంటాం.

– రహీంపాషా, సీఐ, నార్నూర్

జగన్నాథ స్వామి భోగ్ బండార్‌లో సుగుణ



పూజల్లో పాల్గొన్న సుగుణ

ఉట్నూర్‌రూరల్: మండలంలోని తాండ్ర గ్రామంలో జగన్నాథ స్వామి భోగ్ బండార్, అన్నదాన కార్యక్రమం ఘనంగా కొనసాగుతోంది. మథుర లాభాన కులస్తులు జరుపుకునే కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి సుగుణ హాజరై పూజలు చేశారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. నాయకులు గోవింద్, నానక్‌సింగ్, సూరజ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కప్ పోటీలు ప్రారంభం

బోథ్: మండల కేంద్రంలోని లాల్‌పిచ్ మైదానంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సహకారంతో నిర్వహించనున్న ఎమ్మెల్యే కప్ క్రికెట్ పోటీలను మంగళవారం మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ ప్రారంభించారు.

బీమా ఉంటేనే ధీమా



బీమా చెక్కు అందజేస్తున్న అధికారులు

ఉట్నూర్‌రూరల్: ప్రతీ వ్యక్తికి బీమా ఉంటేనే కుటుంబానికి ధీమా ఉంటుందని ఆదిలాబాద్ ఎస్‌బీఐ లైఫ్ బ్రాంచ్ మేనేజర్ రమేశ్ అన్నారు. సోమవారం ఉట్నూర్ మండలంలోని పులిమడుగు గ్రామంలో రాథోడ్ దినేశ్ ఇటీవల గుండె పోటుతో మరణించగా ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్ ఆధ్వర్యంలో మృతుడి భార్య రాథోడ్ సుజాతకు రూ.8 లక్షల 50 వేల బీమా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో డెవలప్మెంట్ మేనేజర్ చిట్ల దేవన్న, లైఫ్ మిత్రులు రాథోడ్ అమృత, రాజేఖర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

'మోటార్లకు కెపాసిటర్లు బిగించాలి'

తాంసి: పంటచేలలోని విద్యుత్ మోటార్లకు రైతులు కెపాసిటర్‌లను బిగించుకోవాలని వి ద్యుత్‌శాఖ ఏఈ మనోజ్ కుమార్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. తాంసి, కప్పర్ల ఫీడర్‌లపై విద్యుత్ వినియోగం పెరిగిందన్నారు. స్టార్టర్‌లలో ఆటోమెటిక్ మోటార్ స్టార్టర్స్ వెంటనే తొలగించి సహకరించాలని కోరారు.

మండల అధికారులకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: భోరజ్ నూతన మండల తహసీల్దార్‌గా రాజేశ్వరి, ఎంపీడీవోగా వేణుగోపాల్ రెడ్డిలు ఇటీవల బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. మంగళవారం సామాజిక కార్యకర్త ముదుపు మానిష్ రెడ్డి ఆయా కార్యాలయాలకు వెళ్లి అధికారులను సన్మానించారు. గ్రామస్తులు భగవాన్ రెడ్డి, అశోక్ రెడ్డి, మహేందర్ యాదవ్, సురేందర్ రెడ్డి, సాగర్ రెడ్డి, దినేష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రైతుభరోసా ఎత్తివేసే దిశగా కాంగ్రెస్'

బోథ్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను ఎత్తివేసే దిశగా చూస్తుందని బీఆర్‌ఎస్ నాయకులు నల్ల జగన్మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై సునీల్

ఇంద్రవెల్లి: మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై దుబ్బక సునీల్ హెచ్చరించారు. ఇటీవల కాలంలో డ్రంక్ అండ్‌డ్రైవ్‌లో పట్టుబడిన 23 మంది వాహన దారులు, డ్రైవరకు మంగళవారం పోలీసుస్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఉట్నూర్ కోర్టులో హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ.1000ల చొప్పున ఫైన్ విధించినట్లు ఆయన తెలిపారు.